ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 1 | సంచిక: 332 | పేజీలు: 4 | వెల: రూ.3/- | గురువారం 7 మార్చి 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



## ముచ్చటగా మూడోసారి మోడీయే ప్రధాని..

ఎన్డీఏ కూటమికి 378 సీట్లు
ఇండియా టీవీ-సీఎన్ఎక్స్ ఒపీనియన్ పోల్

2లో..

### రాష్ట్ర అభివృద్ధికి సహకరించకపోతే..
# కేంద్రంపై పోరాటం

**మా ప్రభుత్వాన్ని పడగొడతారట**

**కేంద్రంలో మోదీ,**
**రాష్ట్రంలో కేడీ అంటున్నారు**

**'పాలమూరు ప్రజాదీవెన'**
**బహిరంగసభలో సీఎం రేవంత్‌రెడ్డి**

**బీఆర్ఎస్, బీజేపీలవి దుర్మార్గపు రాజకీయాలు**

**మేం బాధ్యతతో వ్యవహరిస్తుంటే..**
**సన్నాసుల్లా విమర్శిస్తున్నారు**

**రాష్ట్రానికి సహకరించకపోతే**
**కేంద్రానికి చాకిరేవు పెడతా..**

**రాష్ట్రంలో పదేళ్లూ మేమే అధికారంలో ఉంటాం**

**మమ్మల్ని టచ్ చేస్తే.. మానవబాంబులై పేలుస్తాం**

**తమ 90 రోజుల పాలనపై**
**రెఫరెండానికి సిద్ధమన్న రేవంత్**



మహబూబ్‌నగర్, మార్చి 6 (ప్రభాత ఉదయం): రాష్ట్రంలో కాంగ్రెస్ మూడు నెలలు, ఆరు నెలలు మాత్రమే అధికారంలో ఉంటుందంటూ కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో కేడీ అంటున్నారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. ఏం అన్యాయం చేశామని కాంగ్రెస్ సర్కారును కూల్చుతామని అంటున్నారని నిలదీశారు. ఎవరినైనా ఎదుర్కొంటామని, తెలంగాణ గడ్డపై కాంగ్రెస్ పదేళ్లపాటు అధికారంలో ఉంటుందని చెప్పారు. తమను టచ్ చేస్తే అగ్నికణికలై, మానవ బాంబులై పేలుస్తామని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్, బీజేపీల దుర్మార్గపు రాజకీయాలకు పాతరేయాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ 90 రోజుల పాలనపై రెఫరెండానికి సిద్ధంగా ఉన్నామన్నారు. బుధవారం మహబూబ్‌నగర్‌లోని ఎంవీఎస్ కాలేజీ మైదానంలో కాంగ్రెస్ నిర్వహించిన 'పాలమూరు ప్రజాదీవెన' బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి ..మిగతా 2లో

### గ్రూప్ ఉద్యోగాలకు రాత పరీక్షల
# తేదీలు విడుదల

హైదరాబాద్, మార్చి 6 (ప్రభాత ఉదయం): తెలంగాణ గ్రూప్ 1 పోస్టుల భర్తీకి పాత నోటిఫికేషన్‌ను రద్దు చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. తాజాగా 563 పోస్టులతో కొత్త నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. టీఎస్పీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో ప్రస్తుతం ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. ఇటీవల గ్రూప్ 1 పరీక్ష తేదీలను ప్రకటించిన టీఎస్పీఎస్సీ.. బుధవారం (మార్చి 6) ఇతర పోటీ పరీక్షల తేదీలను వెల్లడిస్తూ ప్రకటన వెలువరించింది. జూన్ 9న గ్రూప్ 1 ప్రిలిమ్స్ నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ గతంలో (ఫిబ్రవరి 26) వెల్లడించారు. అయితే గ్రూప్ 1 మెయిన్స్‌తో సహా గ్రూప్ 2, గ్రూప్ 3 పరీక్షల తేదీలపై చర్చించిన కమిషన్ బుధవారం ప్రిలిమ్స్ పరీక్షల తేదీలను ప్రకటించింది. గ్రూప్ 1 మెయిన్స్ అక్టోబర్ 21 నుంచి జరుగుతాయి. గ్రూప్ 2 ప్రిలిమినరీ పరీక్ష ఆగస్ట్ 7 , 8 తేదీల్లో నిర్వహించనుంది. ఇక గ్రూప్ 3 పరీక్ష ఈ ఏడాది నవంబర్ 17, 18 తేదీల్లో నిర్వహించేందుకు తేదీలను ఖరారు చేసింది.

# అమేథీ బరిలో రాహుల్.. రాయ్‌బరేలీ నుంచి ప్రియాంక



న్యూఢిల్లీ, మార్చి 6 (ప్రభాత ఉదయం): రాహుల్ గాంధీ మళ్లీ తన పాత లోక్ సభ నియోజకవర్గం అమేథీ నుంచి బరిలో నిలవబోతున్నారు. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ.. తన తల్లి స్థానమైన రాయ్ బరేలీ నుంచి పోటీలో ఉండబోతున్నారు. ఈ రెండు స్థానాలకు, కాంగ్రెస్ పార్టీకి మధ్య విడదీయలేని సంబంధం ఉంది. 15 ఏళ్ల పాటు లోక్ సభకు ప్రాతినిధ్యం వహించిన అమేథీ స్థానంలో మళ్లీ విజయకేతనం ఎగురవేయాలని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ నిర్ణయించుకున్నారు. ఈ విషయాన్ని ..మిగతా 2లో



### తిరుమల వెళ్ళి వస్తుండగా
# ఘోర ప్రమాదం

2

**ఐదుగురు దుర్మరణం.. మృతులంతా హైదరాబాదీ వాసులు**



### అన్నదాతల కోసం
# రైతు నేస్తం

## 97 కోట్లతో ప్రాజెక్టు.. 4 కోట్లు విడుదల

హైదరాబాద్, మార్చి 6 (ప్రభాత ఉదయం): రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్సుల అనుసంధానం ద్వారా అన్నదాతల సమస్యను పరిష్కరించే వినూత్న కార్యక్రమమైన రైతు నేస్తంను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. రూ.97 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టులో.. దశలవారీగా మూడేళ్లలో 2601 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే.. మొదటి దశలో 110 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వీడియో కాన్ఫరెన్ యూనిట్లు ఏర్పాటు చేయగా.. ఇందుకోసం 4 కోట్ల నిధులను విడుదల చేసినట్టు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణలో అన్నదాతల సమస్యల పరిష్కారం కోసం "రైతు నేస్తం" అనే వినూత్న కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంతో.. రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్‌ల అనుసంధానం ద్వారా రైతుల సమస్యలను పరిష్కరించనున్నట్టు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమాన్ని దశలవారీగా మూడేళ్లలో 2601 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లను స్థాపించనున్నట్టు రేవంత్ రెడ్డి తెలిపారు. కాగా.. రూ.97 కోట్లతో ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా.. మొదటి దశలో 110 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ల ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఇందుకోసం రూ. 4.07 కోట్ల నిధులను సర్కార్ విడుదల చేసిందన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా ..మిగతా 2లో

# దేశంలో తొలి అండర్‌వాటర్ మెట్రో

## ప్రారంభించిన ప్రధాని

**స్కూలు విద్యార్థులతో కలిసి నదీ గర్భంలో మెట్రోలో ప్రయాణం**

**మోదీ మోదీ, జై శ్రీరాం నినాదాలతో హోరెత్తించిన స్థానికులు**





కోల్‌కతా, మార్చి 6 (ప్రభాత ఉదయం): దేశంలోనే తొలి అండర్ వాటర్ మెట్రో టన్నెల్ అందుబాటులోకి వచ్చింది. కోల్‌కతా మెట్రో రైలు విస్తరణలో భాగంగా నిర్మించిన ఈ అండర్ వాటర్ మెట్రో రైలు కారిడార్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా భారీగా తరలివచ్చిన జనం మోదీ.. మోదీ, జై శ్రీరాం నినాదాలతో హోరెత్తించారు. అండర్ వాటర్ మెట్రో రైలు సేవలను జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని మోదీ.. అందులో తొలి ప్రయాణం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీతోపాటు కొందరు స్కూలు విద్యార్థులు కూడా అదే మెట్రోలో ప్రయాణించారు. ఈ సందర్భంగా స్కూలు విద్యార్థులతో ప్రధాని కొద్దిసేపు ముచ్చటించారు. ఎస్ప్లనేడ్ నుంచి హావ్‌డా మైదాన్ స్టేషన్ వరకు ప్రయాణించిన ప్రధాని మోదీ వెంట.. బీజేపీ బెంగాల్ అధ్యక్షుడు సుకాంత మజుందార్, ఎమ్మెల్యే సువేందు అధికారి ఉన్నారు. ఈ క్రమంలోనే అండర్ వాటర్ మెట్రో రైలు విశేషాలను అధికారులు మోదీకి ..మిగతా 2లో

# రేవంత్ తెలంగాణ సీఎం కావడం మన దౌర్భాగ్యం

## కేటీఆర్ విమర్శల దాడి



హైదరాబాద్, మార్చి 6 (ప్రభాత ఉదయం): తెలంగాణ సీఎం, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. సీఎం రేవంత్‌కు తెలంగాణ ఆత్మ, రాష్ట్రంపై గౌరవం లేదని విమర్శించారు. అందుకే తెలంగాణ ఆత్మగౌరవంపై ప్రధాని మోడీ సాక్షిగా దాడి చేశారన్నారు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా సుదీర్ఘ పోస్టు పెట్టారు మాజీ మంత్రి కేటీఆర్. 'రేవంత్ కు తెలంగాణ "ఆత్మ"లేదు. తెలంగాణపై "గౌరవం" అంతకన్నా లేదు. అందుకే తెలంగాణ "ఆత్మగౌరవం"పై మోడీ సాక్షిగా... రేవంత్ దాడి' అంటూ విమర్శించారు. అసలు తెలంగాణ సోయి లేనోడు.. సీఎం కావడం మన ఖర్మ.. తెలంగాణ ఆత్మగౌరవం విలువ తెల్వనోడు.. ముఖ్యమంత్రిగా ఉండటం మన దౌర్భాగ్యం' అంటూ కేటీఆర్ విమర్శల దాడి చేశారు. 'అసలు "గోల్ మాల్ గుజరాత్ మోడల్" కు.. దతెలంగాణ మోడల్"తో పోలికెక్కడిది.. ఘనమైన "గంగా జెమునా తెహజీబ్ మోడల్" కన్నా.. మతం పేరిట చిచ్చు పెట్టే "గోద్రా అల్లర్ల మోడల్" నీకు నచ్చిందా..?' అని కేటీఆర్ ప్రశ్నించారు. నిన్నటి దాకా.. గుజరాత్ మోడల్ పై.. నిప్పులు !.. ప్రధాని పక్కన సీటు ఇవ్వగానే.. గొప్పలా ? ఇదేం నీతి.. ఇదేం రీతి..' అంటూ విమర్శించారు. 'తెలంగాణ మోడల్ అంటే.. "సమున్నత సంక్షేమ నమూనా".. "సమగ్ర అభివృద్ధికి చిరునామా".. అనేక రాష్ట్రాలు మెచ్చిన ..మిగతా 2లో

# దేశంలో తొలి అండర్‌వాటర్ మెట్రో

**మొదటి పేజీ తరువాయి...**

వివరించారు. కోల్‌కతా మెట్రోలోని ఈస్ట్-వెస్ట్ మెట్రో కారిడార్‌లో భాగంగా నిర్మించిన ఈ అండర్ వాటర్ టన్నెల్ ఎస్ప్లనేడ్ మెట్రో స్టేషన్ నుంచి హౌరా మైదాన్ స్టేషన్ వరకు ఉంది. అయితే దేశంలో తొలి మెట్రో రైలు 1984 లోనే కోల్‌కతాలో పరుగులు తీయగా.. తాజాగా అండర్ వాటర్ టన్నెల్ మెట్రో కూడా కోల్‌కతాలోనే ప్రారంభం కావడం విశేషం. రూ.120 కోట్ల వ్యయంతో ఈ టన్నెల్‌ను హుగ్లీ నది కింద నిర్మించారు. కోల్‌కతా ఈస్ట్-వెస్ట్ మెట్రో పొడవు మొత్తం 16.6 కిలోమీటర్లు కాగా అందులో 10.8 కిలోమీటర్ల పొడవున మెట్రో భూమి కింద ఉంటుంది. ఈ మార్గంలో హౌవ్‌డా మైదాన్ నుంచి ఎస్ప్లనేడ్ స్టేషన్ల మధ్య 4.8 కిలోమీటర్ల మేర ఉన్న లైనులో 520 మీటర్ల పొడవైన అండర్‌వాటర్ మెట్రో టన్నెల్‌ను నిర్మించారు. ఇది హుగ్లీ నదిని 45 సెకన్లలో దాటేస్తుంది. ఈ అండర్ వాటర్ టన్నెల్‌ను అత్యాధునిక టెక్నాలజీతో ప్రకృతి విపత్తులను కూడా తట్టుకునేలా నిర్మించారు. బ్రిటన్‌కు చెందిన పలు ప్రఖ్యాత సంస్థల సహకారంతో ఈ టన్నెల్ నిర్మించారు. ప్రస్తుతం హౌరా నుంచి సీల్దాకు రోడ్డు మార్గంలో వెళ్లాలంటే గంటన్నర సమయం పడుతుండగా.. ఈ అండర్‌వాటర్ మెట్రో మార్గం అందుబాటులోకి రావడంతో కేవలం 40 నిమిషాల్లోనే చేరుకోవచ్చని అధికారులు వెల్లడించారు. ఈ మార్గంలో రోజూ దాదాపు 7 లక్షల మంది మెట్రో రైళ్లలో ప్రయాణం చేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. గురువారం నుంచి నదీ గర్భం నుంచి ప్రయాణికులను అనుమతిస్తామని కోల్‌కతా మెట్రో రైల్ సీపీఆర్వో కౌశిక్ మిత్రా స్పష్టం చేశారు. హౌరా మైదాన్ - ఎస్ప్లనేడ్ మార్గంలో మొత్తం హౌరా మైదాన్, హౌరా స్టేషన్ కాంప్లెక్స్, బీబీడీ బాగ్ 3 స్టేషన్లు ఉన్నాయి. దేశంలోనే ఒక నది కింద నిర్మించిన అతి పెద్ద టన్నెల్ ఇదే కాగా.. ఈ మార్గంలో ఉన్న హౌరా మెట్రో స్టేషన్ భారత్‌లోనే అత్యంత లోతులో నిర్మించిన మెట్రో స్టేషన్‌గా రికార్డుల్లోకి ఎక్కింది. నీటి అడుగున 16 మీటర్ల లోతులో నిర్మించిన టన్నెల్ గుండా మెట్రో రైళ్లు పరిగెత్తనున్నాయి.



## రామేశ్వరం కేఫ్ పేలుడు.. నిందితుడి ఆచూకీ చెబితే రూ.10 లక్షల రివార్డు

బెంగళూరు, మార్చి 6 (ప్రభాత ఉదయం): దేశ ఐటీ రాజధాని బెంగళూరు నగరంలోని అత్యంత రద్దీగా ఉండే రామేశ్వరం కేఫ్‌లో మార్చి 1న జరిగిన పేలుడు ఘటనతో ఉలిక్కి పడింది. ఈ ఘటనలో 9 మంది గాయపడ్డారు. అయితే, ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై విచారణను కర్ణాటక ప్రభుత్వం.. ఎన్ఐఏకు అప్పగించింది. ఇప్పటి వరకూ ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. కానీ, ప్రధాని నిందితుడు ఇంకా పట్టుబడలేదు. ఈ నేపథ్యంలో ఎన్ఐఏ కీలక ప్రకటన చేసింది. బెంగళూరులో గతవారం జరిగిన బాంబు పేలుడు ఘటనలో ప్రధాన నిందితుడి ఆచూకీ ఇంకా లభించలేదు. ముష్కరుడి కోసం గాలింపు కొనసాగిస్తున్నారు. ఈ కేసు విచారణను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) మంగళవారం స్వీకరించింది. తాజాగా, నిందితుడి ఆచూకీ లేదా వివరాలు గానీ తెలియజేసిన వారికి రూ.10 లక్షల నజరానా ఇస్తామని ఎన్ఐఏ ప్రకటించింది. ఈ సమాచారం ఇచ్చినవారి వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చింది. రామేశ్వరం కేఫ్ పేలుడుకు సంబంధించిన ఇప్పటికే ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతోంది. మార్చి 1న రామేశ్వరం కేఫ్‌లో బాంబు పేలుడు సంభవించింది. మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో చోటుచేసుకున్న పేలుడులో పది మంది గాయపడ్డారు. పేలుడు పదార్థాలతో ఉన్న బ్యాగును కేఫ్‌లో గుర్తించారు. అక్కడ సీసీ కెమెరాలో నిందితుడి విజువల్స్ రికార్డ్ అయ్యాయి. మాస్క్, టోపీ, గ్లాసెస్ పెట్టుకుని పూర్తిగా ముఖం కనిపించకుండా కవర్ చేసుకున్నాడు. కేఫ్‌కి వచ్చిన నిందితుడు ఇడ్లీ ఆర్డర్ ఇచ్చి, ఆ తరవాత తన వెంట తెచ్చుకున్న బ్యాగ్‌ని అక్కడే చెట్టు దగ్గర వదిలేసి వెళ్లిపోయాడు. అనంతరం కాసేపటికే బాంబు పేలుడు జరిగింది. కేఫ్‌లోనే దాదాపు 9 నిముషాల పాటు నిందితుడు ఉన్నట్టు సీసీ కెమెరాలో రికార్డ్ అయిన దృశ్యాలను బట్టి తెలుస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో నిందితుడ్ని గుర్తిస్తామని అధికారులు ప్రకటించారు. పేలుడు ఘటన విచారణను ఎన్ఐఏకు అప్పగించే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తుందని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆదివారం ప్రకటన చేశారు. ఆ వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించింది. పేలుడు ఘటనను ఎన్ఐఏకు ఇస్తూ కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు జారీచేసింది.



చిన్నారిని ఆశీర్వదించిన నాయకులు

## చిన్నారికి పెద్దల ఆశీస్సులు

వనపర్తి, మార్చి6(ప్రభాత ఉదయం) వనపర్తి పట్టణ కేంద్రంలోని ఆర్ జి గార్డెన్ లో జి.అలివేలమ్మ చంద్రయుడు ల మనవరాలు పుట్టినరోజు కార్యక్రమం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మదనాపురం మాజీ మార్కెట్ చైర్మన్ మూలమల్ల రాజేశ్వరి భీమ్ రెడ్డి , ప్రధాన ఉపాధ్యాయులు జి రామ్ రెడ్డి , డిప్యూటీ రెవెన్యూ అధికారి శ్రీకాంత్ రావు, ఎక్సైజ్ అధికారి భగవంతు గౌడ్, జి ఈశ్వర సాగర్ ఎం శివశంకర్ తదితరులు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.



## మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది

### జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించిన నియోజకవర్గం కార్పొరేటర్లు

కూకట్‌పల్లి, మార్చి 6 (ప్రభాత ఉదయం) ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేయాలంటూ బిఆర్ఎస్ పార్టీ బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశానుసారం కూకట్ పల్లి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుండా ప్రజల్ని మోసం చేస్తూ ఎల్ఆర్ఎస్ కి డబ్బులు వసూలు చేస్తుందని, దీనికి నిరసనగా బిఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన పోరాడుతుందని, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఎప్పుడూ ప్రజలకు అండగా ఉండే గొప్ప నాయకుడని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్పొరేటర్లు పగుడాల శిరీష బాబురావు, సభీయా గౌసుద్దీన్, ఆవుల రవీందర్ రెడ్డి, జూపల్లి సత్యనారాయణ రావు, మందాడి శ్రీనివాస్ రావు, పండాల సతీష్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు తూము శ్రవణ్ కుమార్, పగుడాల బాబురావు ,నియోజకవర్గం కోఆర్డినేటర్ సతీష్ అరోరా..మేడ్చల్ మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ గౌసుద్దీన్ ,రాములన్న, సుధాకర్ రెడ్డి, మక్కాల నర్సింగరావు, ఇజాజ్ సాయిబాబా చౌదరి ,పవన్, మల్లేష్ యాదవ్, విజయ్ కుమార్, వీరారెడ్డి, డివిజన్ అధ్యక్షులు ఇర్ఫాన్ ,సంతోష్ బిక్షపతి ,అంబటి శ్రీనివాస్, మహిళా నాయకులు భవాని, భారతి, ఉమావతీగౌడ్, కృష్ణకుమారి, సావిత్రి , కన్న లత ,రమా ,హరిత.. ప్రధాన కార్యదర్శులు రాజేష్, వెంకటేష్ హరినాథ్, సిహెచ్ ప్రభాకర్ గౌడ్ సుదర్శన్ రెడ్డి, యూత్ నాయకులు పాతూరు గోపి, సాయి శ్రీనివాస్, అభిలాష్, బొట్టు విష్ణు ,మోజేష్ ,నాని కార్యకర్తలు మహిళా నాయకురాల్లు, అనుబంధ సంస్థ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బాలానగర్ కార్పొరేటర్ అక్రమ నిర్మాణంపై జోనల్ కమిషనర్ చర్యలు తీసుకోరా?

### కూకట్ పల్లి కాంగ్రెస్ ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాది రెడ్డి యుగంధర్ రెడ్డి



కూకట్‌పల్లి, మార్చి 6 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అనుచరులకు చెందిన అక్రమ నిర్మాణాలపై పదుల సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నా, కూకట్ పల్లి జీహెచ్ఎంసీ అధికారులు ఎందుకు జంకుతున్నారో అర్థం కావట్లేదు.! ఇటీవల బాలానగర్ కార్పొరేటర్ అక్రమ నిర్మాణంపై కూకట్ పల్లి కాంగ్రెస్ ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన టౌన్ ప్లానింగ్ అధికారులు, డిప్యూటీ కమిషనర్ షోకాస్ నోటీసులు, స్పీకింగ్ ఆర్డర్స్ ఇచ్చినా కార్పొరేటర్ జవాబు ఇచ్చిన దాఖలాలు లేవని ఆరోపించారు. దీంతో సంబంధిత డిమాలిషన్ నోడల్ అధికారి రమేష్ ఉత్తర్వులు అందడం అందజేశారని తెలిపారు. అప్పటి నుండి నోడల్ అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులు పరోక్షంగా కార్పొరేటర్ కు సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలుస్తోందని అన్నారు. చివరికి జోనల్ కమిషనర్ కు ఎన్నిసార్లు కలిసి నేరుగా ఫిర్యాదు చేసినా,ఆర్డర్స్ ఇచ్చిన అధికారులు అమలు పరచట్లేరు. కార్పొరేటర్ అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామని యుగంధర్ రెడ్డి తెలిపారు .

## ముచ్చటగా మూడోసారి మోడీయే ప్రధాని

న్యూఢిల్లీ, మార్చి 6 (ప్రభాత ఉదయం): నరేంద్ర మోడీ ముచ్చటగా మూడో సారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని 'ఇండియా టీవీ-సీఎన్ఎక్స్' ఒపీనియన్ పోల్ వెల్లడించింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి 378 సీట్లు గెలుచుకుంటుందని, కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి 98 సీట్లు గెలుచుకుంటుందని అంచనా వేసింది. వచ్చే లోక్ సభ ఎన్నికల అనంతరం కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం కొలువుదీరే అవకాశాలు కనిపిస్తున్నాయి. నరేంద్ర మోడీ మచ్చటగా మూడో సారి ప్రధాని పదవిని చేపట్టేందుకు ఆస్కారం ఎక్కువగా ఉంది. ఈ విషయాన్ని 'ఇండియా టీవీ-సీఎన్ఎక్స్ ఒపీనియన్ పోల్' వెల్లడించింది. మంగళవారం విడుదల చేసిన ఈ ఒపినియన్ పోల్ ప్రకారం.. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీఏ) 543 లోక్ సభ స్థానాలకు గాను 378 సీట్లు గెలుచుకోనుంది. 'ఇండియా టీవీ-సీఎన్ఎక్స్' సంయుక్తంగా ఫిబ్రవరి 5 నుంచి 23 వరకు మొత్తం 543 నియోజకవర్గాల్లో నిర్వహించిన ఒపీనియన్ పోల్ లో మొత్తం 1,62,900 మంది పాల్గొన్నారు. ఇందులో పురుషులు 84,350, స్త్రీలు 78,550 ఉన్నారు. ఈ సంస్థ అంచనాల ప్రకారం.. ప్రతిపక్ష కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి (తృణమూల్ కాంగ్రెస్ మినహా) 98 సీట్లు గెలుచుకుంటుంది. అలాగే మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), ఆంధ్రప్రదేశ్ లో వైసీపీ, టీడీపీ, ఒడిశాలో నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బీజేడీ, ఇండిపెండెంట్లు కలిసి మిగిలిన 67 సీట్లు గెలుచుకుంటారని పేర్కొంది. బీజేపీ సొంతంగానే 335 సీట్లు గెలుచుకుంటుందని సర్వే తెలిపింది. ఇందులో గుజరాత్ లో 26 స్థానాలు, మధ్యప్రదేశ్ లో 29, రాజస్థాన్ లో మొత్తం 25, హర్యానాలో మొత్తం 10 , ఢిల్లీలో 7 , ఉత్తరాఖండ్ లో 5, హిమాచల్ ప్రదేశ్ లో మొత్తం 4 స్థానాలను క్లీన్ స్వీప్ చేయనుందని సర్వే తెలిపింది. ఉత్తర్ ప్రదేశ్ లో బీజేపీ 74, దాని మిత్రపక్షాలైన రాష్ట్రీయ లోక్ దళ్ (ఆర్ ఎల్ డీ), అప్నాదళ్ లు మొత్తం 80 సీట్లకు గాను చెరో రెండు స్థానాలు గెలుచుకునే అవకాశం ఉందని పేర్కొంది. ఇక్కడ ఉన్న రెండు సీట్లను అఖిలేష్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్ వాదీ పార్టీ (ఎస్పీ)కి కైవసం చేసుకుందని తెలిపింది. యూపీలో కాంగ్రెస్, బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)లకు ఒక్క స్థానం కూడా దక్కబోదని అంచనా వేసింది బీహార్ లో 17, జారండ్ లో 12, కర్ణాటకలో 22, మహారాష్ట్రలో 25, ఒడిశాలో 10, అసోంలో 10, పశ్చిమబెంగాల్ లో 20 స్థానాలు బీజేపీ గెలుచుకునే అవకాశం ఉందని ఇండియా టీవీ-సీఎన్ఎక్స్ ఒపీనియన్ పోల్ పేర్కొంది. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలు ఎన్ని స్థానాలు గెలుచకనే అవకాశం ఉందో ఆ సంస్థ అంచనా వేసింది. ఇందులో పశ్చిమ బెంగాల్ లో తృణమూల్ కాంగ్రెస్ 21, తమిళనాడులో డీఎంకే 20, ఆంధ్రప్రదేశ్ లో వైఎస్సార్సీపీ 15, టీడీపీ 10, ఒడిశాలో బీజేడీ 10 స్థానాలు కైవసం చేసుకోవచ్చని పేర్కొంది.

## అమేథీ బరిలో రాహుల్.. రాయ్‌బరేలీ నుంచి ప్రియాంక

**మొదటి పేజీ తరువాయి...**

కాంగ్రెస్ అమేథీ జిల్లా అధ్యక్షుడు ప్రదీప్ సింఘాల్ వెల్లడించారు. అయితే ఆయన అభ్యర్థిత్వాన్ని త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని వెల్లడించారు. అదే రాష్ట్రంలోని రాయ్ బరేలీ నుంచి కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా ఎన్నికల అరంగేట్రం చేయనున్నారు. ఆ స్థానం నుంచి చాలా ఏళ్ల పాటు సోనియా గాంధీ ప్రాతినిధ్యం వహించారు. ఉత్తరప్రదేశ్ లో 1967లో ఆవిర్భవించినప్పటి నుంచి అమేథీ కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉంది. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిన్న కుమారుడు సంజయ్ గాంధీ 1977లో తొలిసారి అమేథీ నుంచి పోటీ చేశారు. అయితే ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా వ్యతిరేకత రావడంతో ఓటమిని చవిచూశారు. ఆ తర్వాత 1980లో ఆయన విజయం సాధించారు. కానీ 1981లో జరిగిన విమాన ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఆయన మరణానంతరం ఆయన అన్న రాజీవ్ గాంధీ రాజకీయాల్లోకి ప్రవేశించి 1981లో అమేథీ నుంచి పోటీ చేశారు. 1984, 1989, 1991లలో తిరిగి ఎన్నికయ్యారు. రాజీవ్ సతీమణి సోనియాగాంధీ 1999లో అమేథీ నుంచి పోటీ చేశారు. అయితే, 2004లో వచ్చిన ఎన్నికల్లో ఆమె తన నియోజకవర్గాన్ని గతంలో తన అత్తామామలు ఫిరోజ్ గాంధీ, ఆ తర్వాత ఇందిరాగాంధీ ప్రాతినిధ్యం వహించిన రాయ్ బరేలీకి మార్చారు. రాహుల్ గాంధీ 2004లో అమేథీలో పార్టీ పగ్గాలు చేపట్టి 2009, 2014లో తిరిగి విజయం సాధించారు. అయితే 2019 ఎన్నికల్లో కేంద్ర మంత్రి, బీజేపీ నాయకురాలు స్మృతి ఇరానీ చేతిలో 55 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. ప్రస్తుతం ఆయన కేరళలోని వయనాడ్ నుంచి ఎంపీగా ఉన్నారు. అమేథీ నుంచి కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ స్మృతి ఇరానీపై రాహుల్ గాంధీ మరోసారి పోటీకి దిగితే అమేథీలో మరో ఆసక్తికర పోటీ నెలకొనే అవకాశం ఉంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో స్మృతి ఇరానీ తన నియోజకవర్గంలో రాహుల్ ను 55,120 ఓట్ల తేడాతో ఓడించారు. అయితే ఆ ఎన్నికల్లో వయనాడ్ నియోజకవర్గం నుంచి విజయం సాధించడంతో రాహుల్ గాంధీ లోక్ సభలో అడుగుపెట్టారు. కాగా.. 2004 నుంచి సోనియా గాంధీ లోక్ సభకు ప్రాతినిధ్యం వహించిన రాయ్ బరేలీ స్థానంలో ఇప్పుడు కూతురు ప్రియాంక గాంధీ బరిలో నిలవబోతున్నారు. దాదాపు 20 ఏళ్ల పాటు రాయ్ బరేలీ ఎంపీగా ఉన్న సోనియా గాంధీ.. గత నెలలో రాజ్యసభకు ఎన్నికయ్యారు. రాజస్థాన్ నుంచి ఆమె తొలిసారిగా పెద్దల సభలో అడుగుపెట్టారు.

## అన్నదాతల కోసం రైతు నేస్తం

**మొదటి పేజీ తరువాయి...**

మార్చేందుకు రైతులకు చేదోడు వాదోడుగా డిజిటల్ ఫ్లాట్ ఫారం ఉపయోగపడుతుందని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులతో క్షేత్రస్థాయిలో సమస్యలపై రైతులతో చర్చలు జరపొచ్చని తెలిపారు. గ్రామాల నుంచే రైతులు ఆన్‌లైన్‌లో తమ పంటలకు సంబంధించిన సలహాలు, సూచనలు అందుకోవచ్చని సూచించారు. తమ అనుభవాలను ఇతర రైతులతో పంచుకోవచ్చన్నారు. ప్రతి మంగళవారం, శుక్రవారం విస్తరణాధికారులు.. అన్నదాతలతో "రైతు నేస్తం" కార్యక్రమాన్ని నిర్వహిస్తారని వెల్లడించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ సహకారంతో రాష్ట్ర వ్యవసాయశాఖ రైతులకు భరోసానిచ్చేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు పేర్కొన్నారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో.. సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు కూడా పాల్గొన్నారు. చేపట్టిందన్నారు.

## తిరుమల వెళ్ళి వస్తుండగా ఘోర ప్రమాదం

కర్నూల్, మార్చి 6 (ప్రభాత ఉదయం): ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆళ్లగడ్డ మండలం నల్లగట్ల వద్ద ఆగి ఉన్న లారీని కారు ఢీ కొట్టింది. ఈఘటనలో ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులంతా హైదరాబాద్ చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. తిరుమల తిరుపతి శ్రీవారిని దర్శనం చేసుకుని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. మృతుల్లో ఇద్దరు మహిళలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అతి వేగంగా వచ్చిన కారు ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు సహాయకచర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కారులో ఉన్న వారందరినీ హైదరాబాద్‌కు చెందిన వ్యక్తులుగా గుర్తించారు పోలీసులు. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు తిరుమల దర్శనానికి వెళ్ళి వస్తున్నట్లు తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న భార్యాభర్తలు రవీందర్, లక్ష్మితోపాటు వారి కొడుకు బాల కిరణ్ కోడలు కావ్య శ్రీ, అశోక్ అనే వ్యక్తిగా గుర్తించారు. ఫిబ్రవరి 19న బాల కిరణ్‌తో కావ్య శ్రీ వివాహం జరిగింది. ఈ నేపథ్యంలో శ్రీవారి దర్శనం చేసుకుని తిరిగి వస్తున్నారు. 10 రోజుల్లోనే నవ దంపతుల మృతి పట్ల కుటుంబసభ్యులు తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయారు.

## రేవంత్ తెలంగాణ సీఎం కావడం మన దౌర్భాగ్యం

**మొదటి పేజీ తరువాయి...**

మోడల్.. యావత్ దేశానికే నచ్చిన మోడల్. బుడిబుడి అడుగుల వయసులో బుల్లెటు వేగంతో దూసుకెళ్లిన సమగ్ర, సమ్మిళిత, సమీకృత మోడల్. దేశం మెచ్చిన ఈ తెలంగాణ నమూనాను.. నమో ముందు కించ పరుస్తావా..? నమ్మి ఓటేసిన తెలంగాణపై ఎందుకీ నయవంచన?' అంటూ కేటీఆర్ ధ్వజమెత్తారు. 'నాలుగుకోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని మోదీ కాళ్ల దగ్గర తాకట్టు పెడతావా..?? నాడు తెలంగాణ "ఉద్యమకారులపై రైఫిల్ ఎత్తావ్..".. నేడు "తెలంగాణ ఆత్మగౌరవంపై దెబ్బ కొట్టావ్..".. నిన్ను చరిత్ర క్షమించదు. నా తెలంగాణ దేన్నినైనా సహిస్తుంది కానీ.. ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే మాత్రం ఊరుకోదు' అంటూ కేటీఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ ఆత్మగౌరవ పతాకాన్ని ఆకాశమంత ఎత్తుకు ఎత్తింది.. బీఆర్ఎస్ కానీ.. నేడు పాతాళంలో పాతిపెట్టేస్తోంది.. కాంగ్రెస్ అంటూ కేటీఆర్ విరుచుకుపడ్డారు.


## రాష్ట్ర అభివృద్ధికి సహకరించకపోతే కేంద్రంపై పోరాటం

**మొదటి పేజీ తరువాయి...**

పాల్గొని లోక్‌సభ ఎన్నికల శంఖారావం పూరించారు. సభలో రేవంత్ ప్రసంగం ఆయన మాటల్లోనే.. "మా ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షల బీమా, గృహలక్ష్మి కింద 200 యూనిట్ల ఉచిత కరెంటు, రూ.500కే గ్యాస్ సిలిండర్ పంపిణీకి చర్యలు తీసుకున్నాం. ఈ నెల 11న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించనున్నాం. రైతు భరోసా కింద పెట్టుబడిసాయం అందించడంతోపాటు ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలను అందించాం. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలలే, ఆరు నెలలే ఉంటుందని కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో కేడీ అంటున్నారు. కేసీఆర్, మోదీలు పదేళ్లు అధికారంలో ఉండాలా? పేదల ప్రభుత్వాన్ని ఆరు నెలలు ఉండనీయరా? 40శాతం ఓట్లతో గెలిచిన ప్రజా ప్రభుత్వాన్ని పడగొడతారా? రైతుబిడ్డ సీఎం కుర్చీపై కూర్చుంటే ఓర్వలేరా? ఒకసారి టచ్ చేసి చూడండి.. మేం అగ్నికణికలై, మానవ బాంబులై పేల్చేస్తాం. తమాషా చేస్తే పండబెట్టి తొక్కి పేగులు మెడకేసుకుని ఊరేగుతాం. నల్లమలలో పుట్టి తొక్కుకుంటూ ఇక్కడి వరకు వచ్చా.. ప్రగతిభవన్ కంచెలు బద్దలుకొట్టి బజారుకు ఈడ్చినోడిని. ఈ పాలమూరు బిడ్డకు తట్టా పార, వలసలే కాదు.. నీలాంటి వారిని బొందపెట్టడం కూడా తెలుసు. కాంగ్రెస్ కార్యకర్తల మీద ఆన.. పాలమూరు బిడ్డగా మాటిస్తున్నా.. తెలంగాణ గడ్డపై కాంగ్రెస్ పదేళ్ల పాటు అధికారంలో ఉంటుంది. రాష్ట్రానికి వచ్చిన ప్రధాన మంత్రికి మేం వినతులు ఇస్తే.. ఇక్కడి కొందరు సన్నాసులు ఇష్టమున్నట్టు మాట్లాడుతున్నరు. నేనేమీ మీలాగా ఇంట్లో తలుపులు మూసుకుని, కడుపులో తలకాయ, కాళ్లు పెట్టుకుని పడుకోలేదు. అతిథి సంస్కారంతో ముఖ్యమంత్రిగా బాధ్యత నెరవేర్చిన. రాష్ట్రానికి మేలు జరగాలన్న ఆలోచనతో ప్రధానికి సమస్యలు చెప్పిన. ఒకవేళ బీజేపీ ప్రభుత్వం సమస్యలు తీర్చకపోతే చాకిరేవు కాడ బట్టలు ఉతికినట్టుగా వారిని ఉతికే బాధ్యత నాదే. కేంద్రం సహకరించకపోతే అన్ని రాష్ట్రాలు తిరిగి కొట్లాడుతా.. రాష్ట్రంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వందేళ్ల విధ్వంసం జరిగింది. దుష్ట పాలనలో పందికొక్కుల్లా రాష్ట్రాన్ని దిగమింగారు. పాలమూరు-రంగారెడ్డి, భీమా, నెట్టెంపాడు, కోయల్‌సాగర్, సంగంబండ ప్రాజెక్టులను కుర్చీ వేసుకుని కట్టిస్తానని చెప్పిన కేసీఆర్.. తీవ్ర నిర్లక్ష్యం చేశారు. ఇప్పుడిప్పుడే రాష్ట్రాన్ని గాడినపెడుతున్నాం. గత మూడు నెలల కాంగ్రెస్ పాలనలో ఒక్క గంట అయినా ప్రజలకు దూరంగా ఉన్నామా? ఏం అన్యాయం చేశామని మోడీ, కేడీ మా ప్రభుత్వాన్ని కూలుస్తామని మాట్లాడుతున్నారు? ఆరు అడుగులు ఉన్నామంటూ దూలంలా పెరిగిన కొందరికి ఆవుదూడకున్నపాటి బుద్ధి కూడా లేదు. బీఆర్ఎస్ అంటే బిల్లా రంగా సమితి. కేసీఆర్ తన కుమారుడు సీఎం కాకుండా రైతుబిడ్డ సీఎం అయ్యాడన్న అసూయతో మాట్లాడుతున్నారు. ఒంట్లో బాగాలేదన్నప్పుడు నల్లగొండకు ఏం కాసేందుకు వెళ్లారు? ప్రజలు ఓడించి బొక్కలు విరగ్గొడితే సిగ్గులేకుండా వీధుల్లో పడి కాంగ్రెస్‌ను తిడుతున్నారు. దేశంలో మోదీనైనా, రాష్ట్రంలో కేడీనైనా ఎదురించి నిలబడుతాం. తొడగొట్టి పడగొట్టే ధైర్యాన్ని పాలమూరు బిడ్డలే నాకు ఇచ్చారు. పాలమూరు బాధలు తీర్చే బాధ్యత నేను తీసుకుంటా. పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యం, ఉద్యోగాల కల్పన కోసం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులకు అనుమతులు, నిధులు వేగంగా మంజూరయ్యేందుకు చర్యలు చేపడతాం. ప్రజలు రాష్ట్రంలోని 14 పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలి.." అని రేవంత్ పిలుపునిచ్చారు.

## అత్తాపూర్ ఎస్‌వీఎం గ్రాండ్‌లో ఘనంగా

# శ్రీనివాస్-నందినిల నిశ్చితార్థ వేడుకలు



శ్రీనివాస్ - నందిని నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న ఇరు కుటుంబాల సభ్యులు



నిశ్చితార్థ వేడుకల్లో శ్రీనివాస్ స్నేహితులు



శ్రీనివాస్ - నందిని నిశ్చితార్థ వేడుకలో కుటుంబ పెద్దలు



శ్రేయోభిలాషులు

బుద్వేల్, మార్చి6(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ వాస్తవ్యులు, షాద్ నగర్ లో గల నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ ఆర్ ఎస్ సీ) లో జూనియర్ ఇంజనీర్ గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన కె నరసింహ చారి, దివంగత కృష్ణ కుమారీ ల రెండవ కుమారుడు కె. శ్రీనివాస్ నిశ్చితార్థం బుధవారం రామచంద్రపురం మండలం ఈదుల నాగుల పల్లి గ్రామ వాస్తవ్యులు దివంగత బాల్ చారి, స్వాతి ల కుమార్తె కె. నందిని తో అత్తాపూర్ ఎస్ వీ ఎం గ్రాండ్ లో ఘనంగా జరిగింది. నిశ్చితార్థ వేడుకలను శ్రీనివాస్ తండ్రి కె నరసింహ చారి, సోదరుడు కె రమేష్ చారి వదిన స్నేహ ప్రియ లతో పాటు నందిని బాబాయ్, మాజీ వార్డు మెంబర్ శంకర్ చారి, పిన్ని పావని దగ్గరుండి జరిపించారు. కార్యక్రమంలో శ్రీనివాస్ సోదరీ జ్యోతి, నందిని మేన మామ, భారతీయ జనతా యువ మోర్చ రంగారెడ్డి జిల్లా నాయకుడు కె. కిరణ్ చారి తో పాటు సుమారు నాలుగు వందల మంది బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలలో విద్యుత్ మరమ్మత్తుల పనులు చేపడుతున్న దాతలు

## మైలార్ దేవుపల్లి ప్రభుత్వ పాఠశాల మౌలిక సదుపాయాల కల్పనకు ముందుకు వచ్చిన దాతలు

రాజేంద్రనగర్, మార్చి6(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్ దేవుపల్లి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి దాతలు ముందుకు వచ్చారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు అందిస్తున్న సాయం అభినందనీయమని నవ యువ యూత్ క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షులు రమేష్ రెడ్డి పేర్కొన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో మైలర్ దేవ్ పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లో తరగతి గదులకు దర్వాజాలు, కిటికీలు శిథిలావస్థలో ఉన్నాయి. నవ యువ యూత్ చొరవతో బుధవారం దుర్గ నగర్ కు చెందిన కోతవల్ నరహరి సహకారంతో పది డోర్ ఫ్రేమ్స్ , 20 కిటికీలు తమ సొంత నిధితో సమస్య పరిష్కారం చేశారు. మానవసేవే మాధవసేవ అనే భావంతో ముందుకొచ్చి సంవత్సరలుగా సమస్యను పరిష్కారం చేసినందుకు నవ యువ యూత్ క్లబ్ తరఫున కొతవల్ నరహరిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు ఏర్వ కుమారస్వామి మాట్లాడుతూ... దాతలు ముందుకొచ్చి సర్కారు పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నార. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు రామచందర్ , పల్లపు జగన్ పాల్గొన్నారు.



గాంధీ భవన్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ తో కలసి పాల్గొన్న మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఏ. సదాలక్ష్మి

## రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపోలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

బుద్వేల్, మార్చి6(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్ డిపోలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు . డిపో మేనేజర్ ఎం శ్రీనాథ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలలో పాలమాకుల లోని మహాత్మ జ్యోతిరావు పూలే స్కూల్ ప్రిన్సిపాల్ మల్లేశ్వరి ముఖ్య అతిథిగా హాజరైనారు. వివిధ రూట్ల లో ప్రతిరోజు క్రమం తప్పకుండా ప్రయాణం చేసే 8 మంది మహిళా ప్యాసింజర్లను పిలిచి సన్మానించారు . ఈ కార్యక్రమంలో డిపో మెకానికల్ ఇంజనీర్ నీలిమ, అసిస్టెంట్ మేనేజర్ రవికుమార్, సిబ్బంది సుశీల తదితరులు పాల్గొన్నారు.



మహిళా ప్రయాణికులను సన్మానిస్తున్న రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్ ఎం. శ్రీనాథ్, మహిళా ఉద్యోగులు




కరణం నర్సింహ ముదిరాజ్-లావణ్యల 25 సంవత్సరాల వివాహ వేడుకలో వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న స్నేహితులు

## ఘనంగా కరణం నర్సింహ ముదిరాజ్ - లావణ్యల 25 సంవత్సరాల వివాహ వార్షికోత్సవ వేడుకలు

బుద్వేల్, మార్చి6(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ వాస్తవ్యులు కరణం పెంటయ్య ముదిరాజ్ - లక్ష్మీ ల రెండవ కుమారుడు కరణం నర్సింహ ముదిరాజ్ - లావణ్య ల 25 సంవత్సరాల వివాహ వార్షికోత్సవ వేడుకలు బుధవారం పీడీపీ చౌరస్తాలో ని పారమౌంట్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా జరిగాయి. బంధువులు, మిత్రులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో వివాహ వార్షికోత్సవ వేడుకలలో పాల్గొని కరణం నర్సింహ ముదిరాజ్ - లావణ్య లను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలలో నర్సింహ ముదిరాజ్ కుమారుడు నిశాంత్ కుమార్, కూతురు నందిని అల్లుడు అనిల్ లతో పాటు సోదరులు కరణం సత్యనారాయణ ముదిరాజ్ - పద్మ, కరణం నారాయణ ముదిరాజ్ - శ్రీలత, కరణం శ్రీనివాస్ ముదిరాజ్ - సరిత లు దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కరణం నర్సింహ ముదిరాజ్ దంపతులను ఆశీర్వదిస్తున్న సోదరుడు కరణం సత్యనారాయణ ముదిరాజ్





ప్రధానమంత్రి నరేంద్రమోదీకి స్వాగతం పలుకుతున్న యువ మోర్చా రాష్ట్ర నాయకుడు బొక్క బాల్ రెడ్డి

## ప్రధానమంత్రిని దగ్గరగా కలుసుకోవడం సంతోషకరం: బొక్క బాల్ రెడ్డి

బుద్వేల్, మార్చి6(ప్రభాత ఉదయం) : ప్రధానమంత్రి నరేంద్ర మోడీని దగ్గరగా కలుసుకోవడం సంతోషంగా ఉందని యువ మోర్చా రాష్ట్ర నాయకుడు బొక్క బాల్ రెడ్డి అన్నారు. సంగారెడ్డి పటాన్ చెరు లో దగ్గరగా కలిసి ఆహ్వానం పలికే అవకాశం తనకు దొరికిందని ఆయన అన్నారు. ప్రపంచంలో శక్తివంతమైన ప్రధానమంత్రిగా పేరు తెచ్చుకున్న నరేంద్ర మోడీని దగ్గరగా కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.



శివరాంపల్లి శ్రీ సరస్వతీ శిశు మందిర్ 41 వార్షికోత్సవంలో పాల్గొన్న పుర ప్రముఖులు

## శివరాంపల్లి శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల 41వ వార్షికోత్సవ వేడుకలు

బుద్వేల్, మార్చి6(ప్రభాత ఉదయం): శివరాంపల్లి శ్రీ సరస్వతీ శిశు మందిరం 41 వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం సాయంత్రం పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు జమలాపూర్ కర్ గంగాధర్ ముఖ్య అతిధులు గా హాజరయ్యారు. సీనియర్ నాయకులు పెండ్యాల చంద్రమోహన్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు సదాల చంద్రా రెడ్డి, కార్యదర్శి కాంతార రమేష్ కార్యదర్శి గొట్టె అనిల్ లు పాల్గొన్నారు. పాఠశాల కమిటీ సమితి సభ్యులు ,పోషకులు , పూర్వ విద్యార్థులు మధ్యన అంగరంగ వైభవంగా విద్యా సాంస్కృతిక ప్రదర్శనలు జరిగినాయి.



విద్యార్థుల దేవతా మూర్తుల వేషధారణ





ఆరోమా'స్ కాఫీ షాప్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు, సంఘాల ప్రతినిధులు

## రాజేంద్రనగర్‌లో ఆరోమా'స్ కాఫీ షాప్ ప్రారంభం

బుద్వేల్, మార్చి6(ప్రభాత ఉదయం) : రాజేంద్రనగర్ లో బుధవారం ఆరోమా' స్ కాఫీ షాప్ ప్రారంభమైంది. ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా పదిమందికి ఉపాధి కల్పిస్తూ , తాను కూడా ఉపాధి పొందాలనే ఆలోచనతో బీ టెక్ చదివిన మాస్టర్ వై అభినవ్ తల్లిదండ్రులు వై గోపాల్, హైమావతిలా ప్రోత్సాహం, సహకారంతో ఎన్ఐఆర్ డీ పీ ఆర్ మార్గంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పక్కన ఈ కాఫీ షాప్ ను ప్రారంభించారు. నిత్యం బిజీగా ఉండి, మానసిక ప్రశాంతత కోసం, ఆహ్లాదకరమైన వాతావరణంలో సేదతీరుతూ, కాఫీ ని ఆస్వాదించాలనుకునే వారికి అణువుగా ఉండేలా ఈ కాఫీ సెంటర్ కు రూపకల్పన చేశారు . కాఫీ తో పాటు యువత ఎక్కువగా ఇష్టపడే రకరకాల అల్పాహారాలను అందుబాటులో ఉంచనున్నారు. కాఫీ సెంటర్ ప్రారంభోత్సవంలో వై అభినవ్ తాత - నానమ్మలు వై వెంకటస్వామి - రుక్కమ్మ, బాబాయ్ లు వై శ్రీధర్ - తృప్తి, వై .రామకృష్ణ - సందీపా లు పాల్గొని అభినవ్ ను ఆశీర్వదించారు. కాఫీ షాప్ ప్రారంభోత్సవంలో బంధు మిత్రులతోపాటు వివిధ పార్టీల నాయకులు , సంఘాల ప్రతినిధులు , శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.



# అట్టహాసంగా కాసమ్ ఫ్యాషన్ షాపింగ్ మాల్ ప్రారంభం

## గద్వాలలో సందడి చేసిన ప్రముఖ సినితార మెహ్రీన్


వస్త్రాలయం ప్రారంభోత్సవంలో చీర మోడల్ చూపిస్తున్న నటి మెహ్రీన్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నటి మెహ్రీన్


అభిమానులకు అభివాదం చేస్తున్న నటి


రిబ్బన్ కట్ చేసి వస్త్రాలయం ప్రారంభిస్తున్న నటి మెహ్రీన్

గద్వాల, మార్చి6(ప్రభాత ఉదయం): గద్వాల పట్టణంలో అధునాతన హంగులతో సరికొత్తగా రూపొందించుకున్న కాసమ్ ఫ్యాషన్ షాపింగ్ మాల్ అట్టహాసంగా ప్రారంభమైంది. గద్వాల పట్టణం కృష్ణవేణి చౌరస్తాలో ఏర్పాటు చేసిన కాసమ్ ఫ్యాషన్ షాపింగ్ మాల్ ను బుధవారం ప్రముఖ సినీనటి మెహ్రీన్ ఫిర్జాదా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా షాపింగ్‌మాల్లో ఆమె కలియ తిరిగారు. స్టేజీపై కాసేపు సందడి చేశారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన వేలాది మందిని మెహ్రీన్ తన హావభావాలతో అలరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రముఖ వస్త్ర వ్యాపార సంస్థ కాసమ్ షాపింగ్ మాల్ బ్రాంచ్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. వివాహాది వేడుకలకు, అన్ని శుభాకార్యాలకు కాసమ్ షాపింగ్ మాల్ అనుకూలమైనదని చెప్పారు. కాసమ్ షాపింగ్ మాల్ యాజమాన్యం కాసం మల్లికార్జున్, నమశ్శివాయ, కేదరినాథ్, శివప్రసాద్ మాట్లాడుతూ తెలుగు ప్రజలకు నాణ్యమైన వస్త్రాలు సరసమైనా ధరలకు అందిస్తున్నామని చెప్పారు. రెండు రాష్ట్రాలలో స్టోర్లు నిర్వహిస్తున్నామని, ఇది తమకు 11వ స్టోర్ అని అన్నారు. కుటుంబంలోని అందరికీ నచ్చే విధంగా అన్ని రకాల వెరైటీలు, డిజైన్స్ లభిస్తాయన్నారు. ఇలాంటి సంస్థలు గద్వాలకు రావడంతో పట్టణం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.


రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ గా పదవి బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ చిన్నారెడ్డి సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

# రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డికి ఘన సన్మానం

కొత్తకోట,మార్చి6(ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులుగా నియమితులైన సందర్భంగా డాక్టర్ జి చిన్నారెడ్డిని వనపర్తి జిల్లా కాంగ్రెస్ నాయకులు సన్మానం డాక్టర్ జి చిన్నారెడ్డిని సన్మానించిన వారిలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బోయేజ్ మండల ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు గొల్ల బాబన్న రావుల కర్ణాకర్ రెడ్డి, మోహన్ రెడ్డి లు బుధవారం చిన్నారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.



# నిత్యజీవితంలో కూడా ఉన్నత విద్యను అభ్యసించాలి: హెచ్ఎం రేవతి

గద్వాల,మార్చి6(ప్రభాత ఉదయం) ధరూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాఠశాల హెచ్ఎం రేవతి మాట్లాడుతూ విద్యార్థులు ఒక రోజు స్వయం పరిపాలనా దినోత్సవ వేడుకలలోనే కాకుండా నిత్యజీవితంలో కూడా ఉన్నత విద్యను అభ్యసించి,ఉన్నత ఉద్యోగులుగా ఎదగడానికి గాను విద్యార్థులు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నీలవతి,కిషోర్ చంద్ర,విద్యార్థులు తదితరులు ఉన్నారు.


బీఆర్ఎస్ వ్యాఖ్యలను నిరసిస్తూ రోడ్డును వాషింగ్ పౌడర్‌తో కడుగుతున్న కార్పొరేటర్ శ్రీదేవి

# బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్షం ప్రజల పాలిట శాపం

### కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్

కూకట్‌పల్లి, మార్చి 6 (ప్రభాత ఉదయం): గ్రేటర్ హైదరాబాద్ కార్యాలయం వద్ద బిఆర్ఎస్ నాయకులు చేసిన ధర్నాను శుద్ధిచేసే విధంగా పసుపు నీళ్లతో శుద్ధి చేసిన శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్, ఖైరతాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీమతి.విజయ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ బోరాబండ కార్పొరేటర్ బాబా ఫాసిఉద్దీన్, కాంగ్రెస్ పార్టీ జి.హెచ్.ఎమ్.సి ఫ్లోర్ లీడర్ రాజశేఖర రెడ్డి,ఉప్పల్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి,రెహ్మత్ నగర్ కార్పొరేటర్ సి.ఎన్ రెడ్డి అనంతరం పసుపునీళ్ళతో కడిగి ముగుల్లు వేసిన మహిళ కార్పొరేటర్లు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మేలు చేసే విధంగా 2007లో తీసుకువచ్చిన జి.ఓ వల్ల గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 50 వేల అప్లికేషన్లు ఉన్నాయని, 2015లో నూతన తెలంగాణ టిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు లక్ష యాభై వేల అప్లికేషన్లు ఉన్నాయని, 2020 లో 25లక్షల అప్లికేషన్లను వచ్చిన వాటిని పరిష్కరించకుండా పెండింగులో పెట్టి నేడు ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ధర్నాలు చేయడం దయ్యాలు నీతులు వల్లించినట్టు ఉందని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ లో బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులను ప్రజలకు తెలియచేసే విధంగా వాటిని ప్రక్షాళన దిశగా మా కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మున్సిపల్ శాఖమంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలో ప్రజలకు మేలు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

### ధర్నా చౌక్ ఎత్తేసినోళ్లే

# ధర్నాలా సిగ్గు... సిగ్గు

**అక్రమ నిర్మాణదారులే ధర్నాలు చేయడం విడ్డూరం**


**బిఆర్ఎస్ నేతల ధర్నాలో సీఎం రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు సిగ్గుచేటు**

**కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి**



కూకట్‌పల్లి, మార్చి 6 (ప్రభాత ఉదయం) ధర్నా చౌక్ ఎత్తేసినోల్లే ఎల్ ఆర్ ఎస్ ల పేరుతో ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి విమర్శించారు. ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేయాలని బిఆర్ఎస్ పార్టీ పిలుపుమేరకు బుధవారం కూకట్ పల్లి జోనల్ కమిషనర్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో అక్రమ నిర్మాణాలు ప్రోత్సహించేవారు, నిర్మాణాల వద్ద డబ్బులు వసూలు చేసే వారే ధర్నా చేయడం దురదృష్టకరమన్నారు. ధర్నా చౌక్ ఎత్తేసి ధర్నాలనే నిషేధించిన బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోవడంతో ధర్నా చేస్తుంటే ప్రజలు పెదవి విరుస్తున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం వస్తే ధర్నాలు ఉండవు అన్న టిఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ వచ్చి టిఆర్ఎస్ ప్రభుత్వం రాగానే ధర్నా చౌక్ తొలగించి ధర్నాలను నిషేధించింది. నిరసన తెలిపే వాళ్లపై అక్రమ కేసులు పెట్టి నిర్బంధాలను కొనసాగించింది గత ప్రభుత్వం. కెసిఆర్ ముఖ్యమంత్రి కాగానే తమది ఫక్తు రాజకీయ పార్టీ అంటూ ఇతర పార్టీ నేతలను బిఆర్ఎస్ లోకి తీసుకొని ఉద్యమకారులను అణచివేశారు. అయితే ఒక్కసారిగా పరాజయ పాలు కావడంతో బిఆర్ఎస్ పార్టీ ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేయాలని కొత్త పాట అందుకొని ధర్నాలకు పిలుపునిచ్చిందని, టిఆర్ఎస్ నేతల ధర్నా సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై అనుచితంగా విమర్శలు చేస్తూ నినాదాలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. నిరసనలు ఎవరిని కించపరిచే విధంగా ఉండకూడదని ఈ సందర్భంగా శేరి సతీష్ రెడ్డి తెలిపారు.

# అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతి



గద్వాల,మార్చి6(ప్రభాత ఉదయం) అనుమానస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం జోగులాంబ గద్వాల్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. మానవపాడు అమరవాయి గ్రామానికి చెందిన అల్లిపీర్(45) అనే వ్యక్తి గత కొన్ని సంవత్సరాలుగా గద్వాల పట్టణంలో కృష్ణవేణి చౌక్ లో గల యాదయ్య కాంప్లెక్స్ లో తన్వీర్ పాలిక్లినిక్ నిర్వహిస్తున్నాడు. బుధవారం బిల్డింగ్ పైన గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు గద్వాల టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకొన్న పోలీసులు మృత దేహం గుర్తించలేని పరిస్థితిలో ఉండటంతో స్థానికుల సహాయంతో మృతుడు అల్లిపీర్ గా గుర్తించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గద్వాల పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. మృతుడికి భార్య, ఒక కూతురు, కుమారుడు కలరు. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన అలిఫీర్ అనుమానస్పదంగా మృతి చెందడం పట్ల కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. కాగా.. ఆధారాల కోసం దగ్గరిలో ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. అయితే ఆయనది హత్య లేక ఆత్మహత్య అనేది పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.


ఆరంఘర్ చౌరస్తాలోని ప్రభుత్వ భూమి

# ఆరంగర్ చౌరస్తాలో ప్రభుత్వ భూమిని కబ్జా చేయాలని ప్రయత్నం చేస్తున్నారు

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మార్చి6(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఆరంఘర్ చౌరస్తాలో గల ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి అనంతరం మాట్లాడుతూ . కాటేదాన్ విలేజ్ సర్వేనెంబర్ 54 లో4 ఎకరాల18 గుంటలు, సర్వేనెంబర్ 55 లో4 ఎకరాల 24 గుంటలు, సర్వేనెంబర్ 56 లో 7 ఎకరాల 18 గుంటలు, మొత్తం ప్రభుత్వ భూమి 16 ఎకరాల 20 గుంటల భూమినిలి జిఓ.ఎం.ఎస్ నెంబర్ 1406, తేదీ 4/9/1964 అపుడు ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ కు కేటాయించారు. కొందరు వ్యక్తులు సర్వే నెంబర్ 55 లో 4 ఎకరాల 24 గంటల భూమి మాది అని బహిరంగ మార్కెట్ లో అమ్ముతున్నామని చెప్పి కొందరు వ్యక్తులు ఆ స్థలాన్ని చూపుతున్నారు 65 వేలకు గజము అమ్ముతామని బ్రోకర్లని తీసుకువచ్చి ఆ స్థలాన్ని చూపడం జరుగుతుంది సోషల్ వెల్ఫేర్ కౌన్సిల్ కార్యదర్శి సంపత్ రావు గారికి వనంపల్లి జైపాల్ రెడ్డి ఫోన్ లో కొందరు వ్యక్తులు మాది భూమి అని చెప్పి అమ్ముతున్నామని చూపుతున్నారు అని చెప్పడం జరిగింది. ఆయన మాట్లాడుతూ... గతంలో 6 మంది హైకోర్టులో కేసు వేయడం జరిగింది ఆ కేసులు అన్నిటిని రంగారెడ్డి జిల్లా కలెక్టర్లు గతంలో కొట్టివేపించడం జరిగింది. ఇలాంటి ప్రయత్నాలు చేసే వారికి తగిన గుణపాఠం చెప్తామని అన్నారు తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ యాజమాన్యం సోషల్ వెల్ఫేర్ కౌన్సిల్ మధ్య చర్చలు జరుగుతున్నాయని చెప్పడం జరిగింది త్వరలోనే చర్చలు జరిపి పరిష్కారం అయ్యే విధంగా చూస్తామని అన్నారు అధికారులు వెంటనే అరంఘర్ చౌరస్తాలోని ఏడెకరాల 22 గుంటల భూమి ప్రభుత్వ భూమిలో అంత రాష్ట్ర మినీ బస్ టర్మినల్ బస్టాండ్ నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కబ్జాకు ప్రయత్నిస్తున్న వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు.

# విశ్వవిద్యాలయాలు మేధో సంపత్తి హక్కుల కేంద్రాలుగా ఎదగాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ సైదయ్య....



విద్యార్థులతో కళాశాల అధ్యాపక బృందం

కొత్తకోట,మార్చి6(ప్రభాత ఉదయం) విశ్వవిద్యాలయాలు మేధో సంపత్తి హక్కుల కేంద్రాలుగా ఎదగాలని, అలాగే దైనందిన జీవితంలో ప్రతి అంశం ఏదో ఒక మేధో సంపత్తి హక్కుతో ముడిపడి ఉందని వక్తలు తెలిపారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే ప్రతి పరిశోధన, అకడమిక్ అంశాలలో పేటెంట్, కాపీరైట్ అంశాలను పరిశీలిస్తే పరిశోధకులు,విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని, అలాగే సృజనాత్మకత ఉంటే పెన్సిల్ నుంచి విమానం వరకు పేటెంట్లు పొందే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని వక్తలు అన్నారు. వనపర్తి జిల్లా మోజెర్లలోని ఉద్యాన కళాశాలలో ఏర్పాటుచేసిన లితెలంగాణలో ఉద్యాన రంగంలో వాణిజ్య సంబంధిత మేధో సంపత్తి హక్కుల పై శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఐ పి ఆర్ సెల్, తెలంగాణ రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ సంయుక్తంగా ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ అవేర్నెస్ కార్యక్రమం కింద ఏర్పాటుచేసిన సెమినార్లో మాట్లాడారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఉద్యానవర్సిటీ హార్టికల్చర్ డీన్ డాక్టర్ ఎం. రాజశేఖర్ మాట్లాడుతూ పరిశోధనలో సృజనాత్మకత అంశాలు, రైతులకు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాన్ని వెతికే దిశగా పరిశోధన చేపట్టాలని విద్యార్థులు, పరిశోధకులు, ప్రొఫెసర్లను ఆయన కోరారు.పాల్గొన్నారు విద్యార్థులు, పరిశోధకులు తాము శోధిస్తున్న అంశాలను మీదో సంపత్తి హక్కులుగా మార్చేందుకు అనువైన వాతావరణాన్ని విశ్వవిద్యాలయంలో కల్పిస్తున్నామని, భౌగోళిక గుర్తింపులు, పేటెంట్లకు అవకాశం ఉన్న ఉద్యాన రకాలు, ఉద్యాన అంశాలపై భవిష్యత్తులో వర్సిటీ దృష్టి సారిస్తుందని డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో భౌగోళిక గుర్తింపులకు అనువైన అంశాలు, భౌగోళిక గుర్తింపు పొందే విధానం ఇప్పటివరకు ఉన్న భౌగోళిక గుర్తింపు పొందిన ఉత్పత్తుల వివరాలు, అప్లై చేసుకోవాల్సిన విధానం పైన %తీవంశీశ్రీబ్వ% గ్రూప్ ఫర్ ఐ పి , సంస్థ లీగల్, ఐపిఆర్ హెడ్ సుభాజిత్ సాహ కీలక ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. .. భౌగోళిక గుర్తింపు పొందిన ఉత్పత్తులు, పంటలలో రైతులు 20 నుంచి 30% అధిక లాభాలు, మార్కెట్ ధరలు పొందుతున్నట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో మరో ఎనిమిది నుంచి పది ఉద్యాన పంటలు భౌగోళిక గుర్తింపుకు అనువుగా ఉన్నాయని అన్నారు. విశ్వవిద్యాలయాలు, రైతులు, ప్రభుత్వం కలిసికట్టుగా ముందుకు వస్తే రాష్ట్రం నుంచి అనేక ఉత్పత్తులను భౌగోళిక గుర్తింపులోకి తేవచ్చు అని పేర్కొన్నారు. పేటెంట్ కు అనువైన అంశాలు, పేటెంట్ పరిధిలోకి, వచ్చే అంశాలు, అలాగే రాని అంశాలు, సంబంధిత ఫీజులు, అప్లై చేయాల్సిన విధానం పైన తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రాజెక్ట్ సైంటిస్ట్ డాక్టర్ రాధిక వంగాల ఉపన్యాసం చేశారు. రాష్ట్రంలోని 15 విశ్వవిద్యాలయాలకు సంబంధించిన పేటెంట్ అంశాలపై ప్రభుత్వం సలహాలు, సూచనలు పేటెంట్ అప్లికేషన్లో సాయం చేస్తుందని ఆమె తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో భౌగోళిక గుర్తింపు అర్హత ఉన్న ఉద్యాన పంటలు, వాటి లక్షణాలు, సాగులో ఉన్న ప్రాంతాలు, భౌగోళిక పరిస్థితులు, అలాగే నేషనల్ బ్యూరో ప్లాంట్ జెనెటిక్ రిసోర్సెస్, ప్రొటెక్షన్ ఆఫ్ ప్లాంట్ వెరైటీస్ అండ్ ఫార్మర్స్ రైట్స్ లతో జెర్మ్ప్లాసం రిజిస్ట్రేషన్ కు సంబంధించిన అంశాల పైన ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్, వర్సిటీ ఐ పీ ఆర్ సెల్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ పిడిగం సైదయ్య ఉపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఐ.పి.ఆర్. సెల్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ పిడిగం సైదయ్య, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శాహనాజ్, డాక్టర్ జె. శ్రీనివాస్, డాక్టర్ గౌతమి, డాక్టర్ శంకర్ స్వామి, బి. రాజశేఖర్, టి. బేబీ రాణి, డాక్టర్ ఆర్ పూర్ణిమ మిశ్ర, టీచింగ్ అసోసియేట్స్, నాన్ టీచింగ్ స్టాఫ్, సపోర్టింగ్ స్టాప్ మరియు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 6 (ప్రభాత ఉదయం)కేటిదొడ్డి: అక్రమంగా తరలిస్తున్న 30క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను బుధవారం కేటిదొడ్డి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేటిదొడ్డి ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం తెల్లవారుజామున నంబర్ లేని బొలేరో వాహనంలో అక్రమంగా రాయచూరుకు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న క్రమంలో నందిన్నె చెక్ పోస్టు శివారులో పోలీసులు వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుబడింది. వాహనాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి, జనార్దన్ పై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.